అసంపూర్తి భవనాలను వెంటనే పూర్తి చేయాలి

మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పాల్గొన్న నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 7: మండలంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. నూతన తహసీల్దార్ భవన ప్రారంభోత్సవానికి వస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్‌ఎస్ శ్రేణులు స్వాగతిస్తున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో మాజీ మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.1.18 కోట్లతో తహసీల్దార్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారని గుర్తు చేశారు. మండల పరిషత్ భవనానికి రూ.50 లక్షలు, మహిళా సమాఖ్య భవనానికి రూ.20 లక్షలు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. ఎంపీడీవో భవనానికి మరో రూ.కోటి, మహిళా సమాఖ్య భవనానికి రూ.30 లక్షలు మంజూరు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, బీఆర్‌ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మహేశ్, నాయకులు మహేశ్ హెచ్ ఆర్, లక్ష్మణ్, భీక్యానాయక్, శ్రీకాంత్, జగన్, వెంకటేశ్, రాజు, గణేశ్, బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి

షాబాద్, అక్టోబర్ 7: రైతుల కు సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి దోనూరి కృష్ణ, చంద్రయ్యగౌడ్, నర్సింహారెడ్డి, ఒగ్గు మల్లేశ్, బూర్గుల కృష్ణ, షాబాద్ వీరేశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : కన్యకాపరమేశ్వరి ఆలయంలో సంతానలక్ష్మీదేవిగా అమ్మవారు

షాద్‌నగర్‌రూరల్ : శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా ఎలికట్ట భవానీమాత

కడ్తాల్: మైసిగండి ఆలయంలో లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు

తీరొక్క రూపం.. తన్మయత్వం

నిఖిల జగత్తుకు కన్నతల్లి.. సకల జనాభీష్టాల్ని నెరవేర్చే కల్పవల్లి.. ఆ ఆది పరాశక్తికి భక్తజనం ప్రణమిల్లుతున్నది. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు చండీహోమాలు, కుంకుమార్చనలు, ఇతర విశేష పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల ప్రత్యేకంగా అలంకరించి తమ భక్తిని చాటుకున్నారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పునీతులయ్యారు.

– న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 7

- భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు
- అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తున్న భక్తులు

యాచారం : నందివనపర్తిలో బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో జ్ఞాన సరస్వతి అమ్మవారు

ఆమనగల్లు : వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శాకాంబరీ దేవి అలంకరణలో అమ్మవారు

చేవెళ్ల టౌన్: మహాచండీ రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాత

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

చీరలు పంపిణీ చేసిన కౌన్సిలర్ కందాడి అనుపమ సుప్రసేనారెడ్డి

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 7: దసరాను పురస్కరించుకుని మున్సిపాలిటీలోని 24వ వార్డు పరిధి కుంట్లూరులోని పారిశుధ్య కార్మికులకు సోమవారం కౌన్సిలర్ కందాడి అనుపమ సుప్రసేనారెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రత కోసం కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. వారిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

శెట్టిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆమనగల్లు, అక్టోబర్ 7: మండల పరిధిలోని శెట్టిపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎంను కోరారు. సోమవారం స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు శెట్టిపల్లి వెంకటయ్య, చిక్కుడు నర్సింహ, మహేశ్‌గౌడ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంచాల, అక్టోబర్ 7: మండల పరిధిలోని బోడకొండలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం ఎంపీడీవో బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పారిశుధ్య సమస్య అస్తవ్యస్తంగా మారిందని, వీధి దీపాలు లేకపోవడంతో అంధకారమయంగా మారిందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పాండు, దేవరాం, కుమార్, శ్రీనివాస్‌గౌడ్, టిల్లు తదితరులు ఉన్నారు.

నక్షబాట కోసం రైతుల వినతి

నందిగామ, అక్టోబర్ 7: మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారులోని 153/1 సర్వే నంబర్‌లోని నక్షబాటను కొందరు కబ్జా చేశారని గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పంట పొలాలకు వెళ్లేందుకు రావడం లేదని, సర్వే చేయించి నక్షబాటను అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్

యాచారం, అక్టోబర్ 7: క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో మాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామానికి చెందిన బట్టు శీను సహకారంతో క్రికెట్ కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. మాల్‌లో క్రీ డా మైదానాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చి, సామగ్రిని ఉచితంగా అందజేసి పోటీలను నిర్వహిస్తున్న బట్టు శ్రీనువాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7 : మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామ ప్రధాన రోడ్డు 2 కిలోమీటర్ల మేర గుంతల మయంగా మారడంతో పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి సొంత నిధులతో సోమవారం మరమ్మతులు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఎండీ వాజిద్, మాజీ ఎంపీటీసీ సాయినాథ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కోశాధికారి వినోద్, నేతలు ఖాజమోయినుద్దీన్, జంగారెడ్డి, సత్యం, ఎండీ హఫీజ్, మాణిక్యం, శ్రీనివాస్, పాషా తదితరులు పాల్గొన్నారు.

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, అక్టోబర్ 7: యువతకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి పంచాయతీలోని వంపుగూడెంలో... న్యాక్, తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సోమవారం స్థానిక నాయకులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలను భవన నిర్మాణ కార్మికులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీచ్యానాయక్, అశోక్, సివిల్ ఇన్‌స్పెక్టర్ పుష్పాంజలి, ప్రభాకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేయించాలి

మొయినాబాద్, అక్టోబర్ 7: మండల పరిధిలోని పెద్దమంగళారం నుంచి చందానగర్ గేట్ వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేవైఎం నాయకులు సోమవారం ఎంపీడీవో సంధ్యకు వినతిపత్రం అందజేశారు. చిలుకూరు బాలాజీ ఆలయం కమాన్ నుంచి అప్పోజిగూడ గేట్ వరకు రోడ్డు అధ్వానంగా మారిందని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్‌కుండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లేశ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శులు జగపతి, సీహెచ్ ఏలేశ్‌గౌడ్, నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, పవన్‌కుమార్, వినోద్‌కుమార్, శివశంకర్, శ్రీధర్‌చారి, శ్రీకాంత్, బిందుకిరణ్, నిఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

షాద్‌నగర్, అక్టోబర్ 7: టిప్పర్ వాహనం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన గొల్ల యాదయ్య బైక్‌పై షాద్‌నగర్ వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయలయ్యాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వైద్యం కోసం షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడి నుంచి 7తులాల బంగారం స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 7 : చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఓ దొంగను ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన 24గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేవీపీరాజు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా పీకే మల్లెపల్లి మండల పరిధిలోని వద్దివట్ల గ్రామానికి చెందిన బొంత అనిల్ శాలిబండ సమీపంలో నివాసముంటూ స్కూల్ విద్యార్థులకు ట్యూషన్ చెప్పుకుంటూ జీవితం సాఫీగా గడుపుతున్నారు. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి, వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 9న పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఓ మహిళ వద్ద 4తులాల బంగారు గొలుసును దొంగిలించి పారిపోయాడు. ఆ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని రాందాస్‌పల్లి గ్రామం వద్ద ఓ మహిళా పశువులు మేపుతుండగా తాగడానికి నీళ్లు కావాలని అడిగి ఆమె మెడలో నుంచి 3తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఆ బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి 24గంటల్లోనే సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో నిందితుడు బొంత అనిల్‌ను అదుపులోకి తీసుకొని 7తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కేవీపీరాజు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సైతో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

రెండు తులాల బంగారం, రూ. 28 వేల నగదు మాయం

షాద్‌నగర్, అక్టోబర్ 7: షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి కథనం ప్రకారం.. కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లికి చెందిన అనేమోని కృష్ణ సోదరి అలివేలు ఈ నెల 6న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జడ్చర్ల వైపు వెళ్లే బస్సు ఎక్కడానికి వెళ్లారు. ఇదే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె వద్ద ఉన్న పర్సును దొంగిలించారు. పర్సులో రెండు తులాల బంగారం, రూ.28వేల నగదు ఉందని బాధితురాలు వాపోయారు. ఈ విషయమై షాద్‌నగర్ పోలీసులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశామని బాధితురాలి సోదరుడు కృష్ణ తెలిపారు. ఐదు రోజుల నుంచి బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో భాగానే స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

జాతీయ రహదారి పనులు వెంటనే చేపట్టాలి

ఆందోళన చేస్తున్న నాయకులు

మొయినాబాద్, అక్టోబర్ 7: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఈ పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ మొయినాబాద్‌లో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేందర్, చెన్నయ్య, రవీందర్, హైమద్, బాలు, రవి, శ్రీను, నర్సింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా సుజాత

మండల ప్రత్యేకాధికారి సుజాతను సన్మానిస్తున్న మండల అధికారులు

మంచాల, అక్టోబర్ 7: మంచాల మండల ప్రత్యేకాధికారిగా ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న ప్రత్యేకాధికారి సుభాషిణి సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో సుజాత ఎంపీడీవో నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలశంకర్, ఎంపీవో ఉమారాణి, ఏఈ మల్లారెడ్డి, సూపరింటెండెంట్ అబ్దుల్‌అజీమ్ తదితరులు ఆమెను సన్మానించారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

షాబాద్ :గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని కలిసిన నాయకులు

షాబాద్, అక్టోబర్ 7: గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పా ర్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎం పీటీసీలు చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, ఆశోక్, మా జీ సర్పంచులు ఖాజామియా పటేల్, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, రవీందర్‌నాయక్, ఆం జనేయులు, నాయకులు హరికిషన్‌రెడ్డి, దే వేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, గోపాల్, సంజీవరెడ్డి, గౌరీశ్వర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల రూరల్: గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్ రెడ్డిని నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పామెన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల, మున్సిపల్ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సీనియర్ నాయకులు ఎర్ర గోపాల్, కరుణాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, కాశెట్టి మోహన్, గోవర్ధన్‌రెడ్డి, రవీందర్, తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి సీఐగా శ్రీనివాస్ గౌడ్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7: శంకర్‌పల్లి నూతన సీఐగా శ్రీనివాస్ గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన హబీబుల్లాఖాన్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. గచ్చిబౌలిలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ గౌడ్ బదిలీపై శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నీటి నాణ్యతపై గ్రామ సహాయకులకు అవగాహన

శిక్షణ పొందిన గ్రామ సహాయకులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు

ఆమనగల్లు, అక్టోబర్ 7: ఆమనగల్లు, కడ్తాల్ మండలాల పరిధిలోని గ్రామ మంచినీటి సహాయకులకు నీటి నాణ్యతపై అవగాహన కల్పించారు. సోమవారం రాంనూతల రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అంశాలను వివరించారు. అనంతరం శిక్షణ పొందిన సహాయకులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు ఈఈ రాజేశ్వర్, డీఈఈ రామకృష్ణ, ఎంపీడీవో కుసుమ మాధురి, ఏఈఈలు సందీప్‌కుమార్, వాగ్దేవి, శరత్, శ్రావ్య, ఏటీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఎం కోర్సుకు ఉచిత శిక్షణ

కొత్తూరు, సెప్టెంబర్ 7: జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో కొత్తూరులో అసిస్టెంట్ డ్రెస్ మేకర్స్ (ఏడీఎం) కోర్సుకు సంబంధించి సోమవారం ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు కొనసాగుతుందని జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ రామ్మోహన్ తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలోని పాత పంచాయతీ భవనంలో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. 40 మంది మహిళకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

యాచారం, అక్టోబర్ 7: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మాల్ చెక్ పోస్టు వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకొన్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలానికి చెందిన డ్రైవర్ కోటేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ముందు బైండవర్ చేసినట్లు తెలిపారు.

రిసార్టు, కన్వెన్షన్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడులు

స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మొయినాబాద్, అక్టోబర్ 7: అనుమతి లేకుండా ఈవెంట్లలో మద్యం వినియోగించడంతో శంషాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్‌లో జరిగింది. శంషాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ కృష్ణప్రియ సోమవారం తెలిపిన వివరాలు.. వెంకటాపూర్‌లో ఉన్న రెయిన్‌బో రిసార్టులో ఆదివారం రాత్రి 30 మందితో ఈమెంట్ నిర్వహించారు. ఒక్కొక్కరి వద్ద రూ.4,999 వసూలు చేసి ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకుండా పాండిచ్చేరికి చెందిన మద్యాన్ని వినియోగించారు. సమాచారం అందుకున్న శంసాబాద్ ఎక్సైజ్ పోలీసులు రిసార్టుపై దాడి చేసి 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలోని అవిన్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో దాడి చేసి 22 ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈవెంట్ నిర్వాహకులతో పాటు రిసార్టు, కన్వెన్షన్ నిర్వాహకుల మీద పోలీసులు కేసు నమోదు చేశారు.

మాదిగలకు ద్రోహం చేసిన రేవంత్ సర్కార్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7 : సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చి.. ఇప్పుడు భర్తీ చేస్తున్న టీచర్ పోస్టుల్లో అన్యాయం చేసి మాదిగలకు ద్రోహం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్యాగాలు చేసి 30 ఏండ్ల పోరాటం ద్వారా సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణను సాధించుకుంటే ఆ ఫలాలు మాదిగలకు అందకుండా రేవంత్ రెడ్డి కుట్ర చేయడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు నల్ల జెండాలతో భారీ నిరసర ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగులు, విద్యావంతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాలు.. తల్లారం అనుబంధ గ్రామం దుద్దాగు గ్రామానికి చెందిన కొనింటి శ్రీనివాస్ (42) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం న్యాలట గ్రామ పరిధిలోని సుచేరి ఫామ్స్‌లో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్న క్రమంలో షాక్ కొట్టడంతో దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7: గ్రామాల్లోని ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బడ్జెట్, తదితర అంశాలపై అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీవో, ఏపీవో, ఏవో, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా సింహవాహన సేవ

స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 7: స్థానిక లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో శరన్నవ రాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారిని సింహ వాహన సేవపై ఊరేగించినట్లు పూజారులు పూజారి వామనాచార్యులు, కన్నా చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు ఈ నెల 12 వరకు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.